ప్రాణాపాయం తప్పింది!

● విద్యుత్ తీగలు తగిలి బాలుడికి గాయాలు
● విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో గాయపడిన బాలుడు రెహమాన్

కుత్బుల్లాపూర్: బహిరంగ ప్రదేశాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు యమపాశాలుగా మారుతున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ బాలుడి ప్రాణాల మీదికి తెచ్చింది. బంతి కోసం వెళ్లిన బాలుడికి విద్యుత్ వైర్లు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సుభాష్‌నగర్ లాస్ట్‌బస్టాప్ ప్రాంతానికి చెందిన నూరుద్దీన్ కుమారుడు అబ్దుల్ రెహమాన్(8) స్థానికంగా ఉన్న యువకులతో మంగళవారం క్రికెట్ ఆడుకుంటున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పడిన బంతి కోసం వెళ్లిన రెహమాన్‌కు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే పడిపోయాడు. ఇది గుర్తించి స్థానికులు వెంటనే బాలుడిని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గతంలో అధికారులను కోరినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై విజిలెన్స్ దాడులు ఆపాలి



మాట్లాడుతున్న గ్రామీణ వైద్యుల సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ హుస్సేన్

సుభాష్‌నగర్: తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్ఎంపీలు, పీఎంపీలపై నిర్వహిస్తున్న దాడులను వెంటనే నిలిపి వేసి న్యాయం చేయాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హుస్సేన్ మాట్లాడుతూ.. గతంలో సీఎంలుగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్యల హయాంలో జీవో నం.429 ద్వారా గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇప్పించారని తెలిపారు. 80 శాతం మంది పీఎంపీ, ఆర్ఎంపీలు శిక్షణ పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు.

◆ కరోనా మహమ్మారి సమయంలో ఈ శిక్షణ నిలిచిపోవడంతో మరో 20 శాతం మంది శిక్షణ తీసుకోలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ట్రెనింగ్ విషయాన్ని పొందుపరిచిన మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో అమలు చేయలేదన్నారు. ఇటీవల ఎన్ఎంసీఐ, టీఎస్ఎంసీ, హెచ్ఆర్‌డీఏ, విజిలెన్స్ దాడులు ఆర్ఎంపీలపై ఎక్కువయ్యాయని వాపోయారు. వీటిని వెంటనే నిలుపుదల చేసి జీవో 429 ప్రకారం శిక్షణ ఇవ్వాలన్నారు. అదే విధంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు పల్లె దవాఖానాలు, పీహెచ్‌సీలలో ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు వంగరి విష్ణు, సాంబశివ, బాబా లింగం, హరికృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాలాపై వెలసిన నిర్మాణాన్ని తొలగిస్తాం



చెరువు దిగువ భాగాన తూము అలుగు నుంచి పారే కట్టుకాలను కలుపుకొని ప్రహరీ నిర్మాణం



కట్టుకాలువని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారి నిఖిత

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని చెరువు దిగువ భాగాన తూము, అలుగు నుంచి పారే కట్టు కాలువను సైతం కలుపుకొని ఓ వ్యక్తి ప్రహరీ నిర్మించాడు. ఈ విషయమై స్థానిక కౌన్సిలర్ రవీందర్‌యాదవ్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఆ శాఖ అధికారి ఏడబ్ల్యూఈ నిఖిత కట్టు కాలువపై నిర్మాణాలు చేపట్టారాదని పనులు ఆపివేశారు. ఇంతలోనే సదరు వ్యక్తి రెండు నాలాలను తన స్థలంలోకి కలిపి ప్రహరీ నిర్మించాడు. దీంతో విషయం తెలుసుకున్న అధికారి నిఖిత మంగళవారం కబ్జాకు గురవుతున్న కట్టు కాలువను పరిశీలించారు. సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని నాలాపై వెలసిన నిర్మాణాన్ని తొలగిస్తామని చెప్పారు.

హెచ్ఐసీసీలో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం

మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను నటి రీతు చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణమైన భారతీయ దుస్తులు, డిజైనర్, వెస్టన్ వేర్, ఇండియన్ అప్పరల్, హ్యాండ్‌లూమ్స్, కాస్ట్యూమ్ డిజైనర్, జువెలరీతో పాటు గృహోపకరణాలు, పాదరక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని, ప్రదర్శనలో 70 స్టాల్స్‌కు పైగా ఉన్నాయని నిర్వాహకులు ఉమేష్ మాద్యం తెలిపారు.

విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి

దుండిగల్: రానున్న వర్షాకాలం నేపథ్యంలో రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి అన్నారు. దుండిగల్, బౌరంపేట ప్రాంతాల్లో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులు విత్తనాలను కేవలం అధీకృత లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే తీసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. రసీదులో పంట పేరు, రకం, లాట్ నెంబరు, కాల పరిమితికి సంబంధించిన ఉండే విధంగా నమోదు చేసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు తమ వద్దనే ఉంచుకోవాలన్నారర్తీ కార్యక్రమంలో బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, డైరెక్టర్లు వెంకట్రామ్ సత్తిరెడ్డి, డప్పు కిష్టయ్య, కౌన్సిలర్ అమరం గోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు..

◆ సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్టె విత్తనాలైన జనుము, జీలుగా విత్తనాలపై 60 శాతం సబ్సిడీ ఉంటుంది.

◆ జనుము 40 కేజీల బస్తా ధర రూ. 3,620 ఉండగా 2,172 సబ్సిడీ పోగా రూ.1,448 రైతు చెల్లించాలి.

◆ జీలుగా 30 కేజీల బస్తా రూ.2,790 ఉండగా 1,674 సబ్సిడీ పోగా రూ.1,116 రైతు చెల్లించాలి.

◆ పచ్చి రొట్టె విత్తనాలు వేసిన తరువాత 45 రోజులకు భూమిని కలియ దున్నడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

◆ బౌరంపేటలోని సొసైటీ కార్యాలయంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించి విత్తనాలను తీసుకెళ్లాలని అధికారులు కోరుతున్నారు.

డీసిల్టింగ్ పనులు దాదాపు పూర్తి

● జంట సర్కిళ్ల పరిధిలో 32కిలో మీటర్ల మేర పనులు ● జూన్ చివరిలోపు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు..





కుత్బుల్లాపూర్ సర్కిల్ శివారెడ్డినగర్‌లో పనులు చేయక ముందు.. ఆ తర్వాత





గాజులరామారం సర్కిల్ శ్రీనివాస్‌నగర్‌లో పనులకు ముందు.. ఆ తర్వాత

జగద్గిరిగుట్ట: జంట సర్కిళ్ల పరిధిలో డీసిల్టింగ్ పనులు దాదాపు పూర్తి అయ్యాయి. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో రూ.75లక్షలు, గాజులరామారం సర్కిల్‌లో రూ.83 లక్షలతో ఈ పనులను జనవరిలో ప్రారంభిచారు. జంట సర్కిళ్లలో సుమారు 32 కిలోమీటర్ల (కుత్బుల్లాపూర్ 18 కిమీ, గాజులరామారం 13.65కిమీ) మేర పనులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం 28 కిలోమీటర్ల (కుత్బుల్లాపూర్ 15.93 కిమీ, గాజులరామారం 12.05కిమీ) పనులు పూర్తయ్యాయి.

◆ నాలా పరిసరాల్లో ఉండే కాలనీలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టారు. జూన్ నెలాకరు వరకు ఈ పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పనులు వీలైనంత తొందరగా పూర్తి చేస్తామని జంట సర్కిళ్ల ఈఈలు కిష్టప్ప, కృష్ణ చైతన్య తెలిపారు.

మాన్‌సూన్ ప్లాన్....

◆ వర్షాకాలంలో ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే స్పందించేలా జంట సర్కిళ్లలో మాన్‌సూన్ 4 బృందాలను ఏర్పాటు చేశారు. షిఫ్ట్‌కి నలుగురు చొప్పున 4 వాహనాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోని సుభాష్‌నగర్, కుత్బుల్లాపూర్ వార్డులలో రూ.50లక్షలు, రంగారెడ్డినగర్, జీడిమెట్ల వార్డులలో రూ.50లక్షలు, అలాగే గాజులరామారం సర్కిల్‌లోని జగద్గిరిగుట్ట, గాజులరామారం వార్డులలో రూ.55లక్షలు, చింతల్, సూరారం వార్డులలో రూ.54లక్షలతో టెండర్లు పిలిచారు.

కొంపల్లిలో దాదూస్ అవుట్‌లెట్ ప్రారంభం

కుత్బుల్లాపూర్: భారతీయ స్వీట్లు, స్నాక్స్‌కు ప్రసిద్ధి చెందిన దాదూస్ నూతన అవుట్‌లెట్‌ను మంగళవారం కొంపల్లిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదూస్ యజమాని రాజేష్ దాదూ మాట్లాడుతూ.. తమ అవుట్‌లెట్‌లో బొబ్బట్లు, బెల్లం అరిసెలు, పూతరేకులు, కాజు పాకం, వివిధ రకాల పిండి వంటలతో పాటు, ఆహార ప్రియుల అభిరుచులకు తగ్గట్లుగా స్నాక్స్‌లు అందిస్తున్నామన్నారు. త్వరలో నగర వ్యాప్తంగా తమ శాఖలను విస్తరించనున్నామని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలు ప్రాంతాలు, బస్తీలకు చెందిన ప్రజలు మంగళవారం ఆయనను షాపూర్‌నగర్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శ్రీశైలంగౌడ్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

బీసీలను వైస్ చాన్సలర్లుగా నియమించాలి

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో బీసీలను వైస్ చాన్సలర్లుగా నియమించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పది యూనివర్సిటీల వీసీల పదవీ కాలం ముగిసిందని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక సెర్చ్ కమిటీని నియమించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేపట్టబోయే వీసీల నియామకంలో ఐదుగురు బీసీ ప్రొఫెసర్లకు వైస్‌చాన్సలర్లుగా అవకాశం ఇవ్వాలన్నారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామన్నారు.

కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అనంతరం కుంకుమార్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం శైలజ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



బహదూర్‌పల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కమ్మ సేవా సమితి సభ్యులు

కుత్బుల్లాపూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు జయంతి మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఐడీపీఎల్, షాపూర్‌నగర్, కొంపల్లి, దూలపల్లి, బహదూర్‌పల్లి చౌరస్తాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎన్టీఆర్ యుగపురుషుడని, తెలుగు ప్రజలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చారని, ఆయన సేవలను తెలుగు ప్రజలు ఎన్నడూ మరువరన్నారు. అనంతరం ఎన్టీఆర్ జీవిత చరిత్రను రచించిన మన్నే శ్రీనివాస్‌రావును కమ్మసేవా సమితి ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ప్రెసిడెంట్ బొడ్డు రవిశంకర్ రావు, ప్రధాన కార్యదర్శి బొబ్బా రంగారావు, కోశాధికారి పరుచూరి శివరామ్‌ప్రసాద్, గుమ్మడి రామాంజనేయులు, మన్నే రామ్మోహన్‌రావు, పరుచూరి దిలీప్‌చౌదరి, గూడపాటి శివరామకృష్ణ, యలవర్తి వెంకట రామకృష్ణ, గోగినేని శ్రీనివాసరావు, శింగమనేని లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి..

కుత్బుల్లాపూర్: తెలుగు రాష్ట్రాల ముద్దుబిడ్డ, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని షాపూర్‌నగర్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. తెలుగు ప్రజల కీర్తిప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిన మహనీయుడని కొనియాడారు. ఎన్టీఆర్ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న బిరుదును ప్రకటించాలని కోరారు.

బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



జేకే శేఖర్‌యాదవ్, రావుల శేషగిరిలను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని కుత్బుల్లాపూర్ నియోకవర్గ ఆ పార్టీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ అన్నారు. మంగళవారం గాజులరామారంలో జరిగిన కార్యక్రమంలో శేఖర్‌యాదవ్‌తో పాటు కార్పొరేటర్ రావుల శేషగిరిని బీజేపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంతో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి శంభీపూర్ విజయేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పొల్కం విఘ్నేష్‌ముదిరాజ్, శిరీష, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి వనమాల, డివిజన్ కార్యదర్శులు విజయ్, శ్రీకాంత్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రియల్టర్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

● దొరకని డ్రైవర్ రేణుకాప్రసాద్, మరో ఇద్దరి జాడ
● వారి ఆచూకీ కోసం నగరంలో జల్లెడ పడుతున్న బీదర్ పోలీసులు
● నిందితులు వారేనని అనుమానిస్తున్న పోలీసులు
● బీదర్‌లోని ఓ క్లబ్ నుంచి బయటకొస్తున్న దృశ్యాలు స్వాధీనం
● హత్య మిస్టరీని త్వరలోనే ఛేదిస్తామంటున్న బీదర్ పోలీసులు



మృతుడు మధు (ఫైల్)



నిందితులు రేణుకాప్రసాద్, లిఖిత్ సిద్ధార్థరెడ్డి

కుత్బుల్లాపూర్: కాపు సంఘం నేత, రియల్ వ్యాపారి మధు హత్య కేసు మిస్టరీని ఛేదించేందుకు బీదర్ పోలీసులు హైదరాబాద్ నగరంతో పాటు పలు ప్రాంతాల్లో జల్లెడ పడుతున్నారు. రియల్టర్ మధు ఈనెల 24న ఉదయం బయలుదేరి వెళ్లి అదే రోజు రాత్రి హత్యకు గురి కావడం కుత్బుల్లాపూర్‌లో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈనెల 27వ తేదీన 'ఎవరు చంపారు.. ఎందుకీ దారుణం'అనే కథనం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. అందరితో కలివిడిగా ఉండే మధు హత్య విషయం వెలుగులోకి రావడంతో అసలు హత్య ఎలా జరిగింది.. ఎవరు చేశారు? అని చర్చించుకోవడం కనిపించింది. డ్రైవర్ రేణుకాప్రసాద్‌తో పాటు లిఖిత్ సిద్ధార్థరెడ్డి, మరో మైనర్‌తో కలిసి కారులో వెళ్లినట్లు గుర్తించారు. హత్య జరిగిన రోజు నుంచి ఇప్పటి వరకు డ్రైవర్ రేణుకాప్రసాద్‌తో పాటు మరో ఇద్దరి జాడ దొరకలేదు. వారి ఫోన్లు సైతం స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానాలకు బలం చేకూరుతోంది. ఒంటిపై ఉన్న సుమారు రూ.20లక్షల విలువచేసే నగలతో పాటు ఇంటి నుంచి తీసుకెళ్లిన రూ.5లక్షల నగదు సైతం మాయంకావడంపై విచారణ కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నారు. బీదర్ సమీపంలో ఉన్న క్లబ్ బయటకు వస్తున్న దృశ్యాలను అక్కడ సీసీ కెమెరా నుంచి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నట్లు పుకార్లు..

మధు హత్య కేసులో కీలకంగా భావిస్తున్న డ్రైవర్ రేణుక ప్రసాద్ బీదర్ పోలీసులకు పట్టుబడ్డట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. డ్రైవరే ఈ హత్య చేసినట్లు పలువురు భావిస్తున్నారు. మధు భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉండగా ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తూ వస్తున్న డ్రైవర్ రేణుకాప్రసాద్ అందరితో ఇంట్లో కలివిడిగా ఉండేవాడు. కొంతమంది మధు పెద్ద కుమార్తెతో ప్రేమ వ్యవహారమే కారణమని చెబుతుండగా అటువంటిది ఏమీ లేదని కుటుంబ సభ్యులు కొట్టి పారేస్తున్నారు. ఇది కావాలని చేస్తున్న పుకార్లు అని స్పష్టం చేశారు. హత్య కేసు మిస్టరీ త్వరలోనే ఛేదిస్తామని బీదర్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గంగాస్థాన్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గంగాస్థాన్ ప్రధాన రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్‌లో..

◆ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రామరాజునగర్, లయోలా అకాడమీ,ఓం బుక్స్,గ్రీన్‌పార్క్, మైఫ్రెండ్స్ సర్కిల్, సురక్ష ఆస్పత్రి.

◆ ప్రాగా టూల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు ఎస్‌సీఆర్ గోదావరి, జీఎల్ఆర్ ఎన్‌క్లేవ్, ప్రాగా టూల్స్ కాలనీ, బీహెచ్‌ఇఎల్ విస్టా, లక్ష్మీ గంగా ఎన్‌క్లేవ్, శాంతా శ్రీరామ్ అపార్ట్‌మెంట్స్, ఆదిత్య విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేట్‌బషీరాబాద్ ఏఈ తెలిపారు.

బౌరంపేట సబ్‌స్టేషన్ పరిధిలో..

దుండిగల్: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బౌరంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని కేవీఆర్ కాలనీ, నేచర్ బౌంటీ, స్ప్రింగ్ ఉడ్స్, లేక్ రిడ్జ్ హోమ్స్, శంభీపూర్, మహేశ్వరం ప్రాంతాల్లో బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయికిరణ్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బౌరంపేట గ్రామం, ప్రణీత్ బ్లూమ్స్, కీర్తి హోమ్స్, డిజె హోమ్స్, ప్రణీత్ మిడోస్, సిల్వర్ ఓక్స్, ఎస్ఆర్‌కె విల్లాస్, ల్యాండ్ మార్క్-2, అక్షయ్ డెవలపర్స్, సుకృతి హోమ్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

షిర్డీహిల్స్ ఫీడర్ పరిధిలో..

జగద్గిరిగుట్ట: షిర్డీహిల్స్ ఫీడర్ పరిధిలోని షిర్డీహిల్స్, రాజీవ్ హిల్స్, అంజయ్యనగర్, భూదేవి హిల్స్, కూన మహాలక్ష్మినగర్‌లలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జగద్గిరిగుట్ట ఏఈ రాధాకిషన్‌రెడ్డి ఏఈ తెలిపారు.

మొక్కులు చెల్లించుకున్న బీఆర్ఎస్ నేతలు



స్వామివారిని దర్శించుకున్న బీఆర్ఎస్ నేతలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హ్యాట్రిక్ విజయం సాధించడంతో బీఆర్ఎస్ నేతలు మొక్కులు తీర్చుకున్నారు. గతేడాది జూలైలో మలేషియాలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని కుత్బుల్లాపూర్ నేతలు దర్శించుకున్నారు. కేపీ వివేకానంద్ గెలవాలని వేడుకున్నారు. భారీ మెజార్టీతో గెలవడంతో కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు దుదిమెట్ల సోమేశ్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్ స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



కళాశాలను ప్రారంభిస్తున్న జెట్టి కుసుమకుమార్, బాలకృష్ణారెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల, సుందర ఎడ్యుకేషన్ అకాడమీలను మంగళారం రాష్ట్ర కాంగ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్, నల్సార్ యూనివర్శిటీ మాజీ వీసీ బాలకృష్ణారెడ్డి, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అన్ని వర్గాల విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు విద్యాసంస్థల యాజమాన్యం కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి, మెట్రో టీవీ ఎండీ జయప్రసాద్, ఫాదర్ విన్సెంట్, కౌన్సిలర్ జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి, విద్యాసంస్థల అధినేత సరిత, సుందర రాజు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో పారామెడికల్ సైన్సెస్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు అందిస్తున్న ఏకైక కేంద్రీయ విశ్వవిద్యాలయం మనూ అని అలైడ్ హెల్త్ అండ్ ఒకేషనల్ సైన్సెస్ విభాగం నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ మక్బూల్ అహ్మద్ మంగళవారం తెలిపారు .యూనివర్శిటీలో 2023 సంవత్సరంలో మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ అండ్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీలో మాస్టర్ ఆఫ్ ఒకేషనల్‌ను ప్రారంభించిందన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఎంఎల్‌టీ, ఎంఐటీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందన్నారు. దరఖాస్తులను సమర్పించడానికి జూన్ 30 ఆఖరు అని తెలిపారు. దరఖాస్తులు, ప్రాస్పెక్టస్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు ప్రొఫెసర్ ఎస్ మక్బూల్ అహ్మద్(9440366462), డానిష్ (9990853997) లో సంప్రదించాలన్నారు.

వీర జవాన్ల ఇళ్ల కూల్చివేత అన్యాయం

లిబర్టీ: ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ రక్షణ కోసం పని చేస్తున్న వీర జవాన్ల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. వీర జవాన్లు నివసించే ఇళ్లను కూల్చివేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమకొండలో మున్సిపల్ అధికారులు విచక్షణ లేకుండా కూల్చివేశారని ఆరోపించారు. ఇల్లు కూల్చివేయొద్దని హైకోర్టు ఆదేశించినా లెక్క చేయరా అని నిలదీశారు. కూల్చివేసిన స్థానంలోనే వీర జవాన్లకు తిరిగి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాసుపత్రులలో సమస్యలను పరిష్కరించాలి

హిమాయత్‌నగర్: హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించాలని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులను పేషంట్‌లకు అందుబాటులో ఉంచాలని, ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్స్ పోస్టులను భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. మంగళవారం ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కింగ్‌కోఠిలోని జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని రకాల డయాగ్నోసిస్ సేవలను అందుబాటులో ఉంచాలన్నారు.